# స్వల్పకాలంలో

# అధిక స్థాయిలకు




**సమీక్ష:** గతవారం స్థిరీకరణలో నడిచిన సెన్సెక్స్ 18000 కీలక స్థాయిని అధిగమించింది. రెండేళ్ల గరిష్ఠ స్థాయి 18131 వద్ద ముగిసి మొత్తం మీద 175 పాయింట్ల లాభాలను ఆర్జించింది.

అమెరికా ఆర్థిక గణాంకాలతో పాటు ఆ దేశ ఆర్థిక ఫలితాలు బలహీనంగా ఉండడంతో మన మార్కెట్లపైనా ఆ ప్రతికూలత కనిపించింది. దీంతో సెన్సెక్స్ బలహీనంగా ప్రారంభమైంది. భారత వృద్ధి రేటుపై అంచనాలు మార్కెట్‌ను పెంచినా లాభాల స్వీకరణతో మంగళవారం 17848 వద్ద వారపు కనిష్ఠానికి పతనమైంది. అయితే ఆ తర్వాత అనుకూలతలు కనిపించాయి. లోహ ధరలు పెరగడం; కంపెనీల మెరుగైన ఆర్థిక ఫలితాలు, ఆహార ద్రవ్యోల్బణం దిగిరావడంతో పాటు ఫ్రాన్స్, జర్మనీ ఆర్థిక గణాంకాలూ అంచనాల కంటే మిన్నగా నమోదవడం వంటి విషయాలు మార్కెట్ సెంటిమెంటును బలపరచాయి. అమెరికా గృహ విక్రయాలూ పెరగడంతో సెన్సెక్స్ 18238 వద్ద గరిష్ఠాన్ని తాకింది. అయితే లాభాల స్వీకరణతో ఆ స్థాయి కంటే దిగువన ముగిసింది.

**ఎఫ్ఐఐల తీరు:** విదేశీ సంస్థాగత మదుపుదార్లు తమ ధోరణిని కొనసాగించారు. రూ.1843 కోట్ల నికర కొనుగోళ్లు చేశారు. ఫండ్లు మాత్రం రూ.995 కోట్ల నికర విక్రయాలు చేశాయి.

**రంగాల వారీగా:** చైనా నుంచి డిమాండు పెరుగుతుందన్న అంచనాలతో అంతర్జాతీయ మార్కెట్లో లోహ ధరలు పెరిగాయి. దీంతో లోహ సూచీ అధిక లాభాలను ఆర్జించింది. ఆర్థిక ఫలితాల నేపథ్యంలో యంత్ర పరికరాల షేర్లు ఎగశాయి. పవర్ గ్రిడ్ ఎఫ్‌పీఓకు ప్రభుత్వ ఆమోదం దరిమిలా పీఎస్‌యూ సూచీలో కొనుగోళ్లు పెరిగాయి. ఆరోగ్య సంరక్షణ, ఎఫ్ఎంసీజీ, చమురు-సహజవాయువు రంగాల్లో విక్రయ ఒత్తిళ్లు కనిపించాయి.

**విస్తృతి:** లాభపడ్డ, నష్టపోయిన షేర్ల నిష్పత్తి శుక్రవారానికి 2:3గా నమోదవడం చూస్తే ఎంపిక చేసిన షేర్లలో విక్రయాలు జరిగాయని అర్థమవుతోంది.

**ఈ వారంపై అంచనాలు:** కీలక 18000 స్థాయిని మార్కెట్ దాటింది. కాబట్టి స్వల్పకాలంలో ఈ ర్యాలీ కొనసాగగలదు. ఈ సమయంలో మార్కెట్‌కు 17846 వద్ద మద్దతు లభించొచ్చు. ఈ స్థాయి కంటే మార్కెట్ పైన నిలిచినంత వరకూ 19000 పాయింట్ల వరకూ ర్యాలీ కొనసాగడానికి అవకాశం ఉంటుంది.

**ప్రభావం చూపే అంశాలు:** అంతర్జాతీయ మార్కెట్లు ముఖ్యంగా ఐరోపా బ్యాంకుల సమీక్ష మార్కెట్ దిశను ప్రభావితం చేయగలదు. దేశీయంగా రేపు(జులై 27న) జరగనున్న రిజర్వు బ్యాంకు పరపతి విధాన సమీక్ష ఫలితాన్నీ మార్కెట్ దగ్గర నుంచి పరిశీలించే అవకాశం ఉంది. కీలక రేట్లలో పెంపు ఉంటే మాత్రం మార్కెట్ సెంటిమెంటు బలహీనపడొచ్చు. పార్లమెంటు సమావేశాల్లో డీటీసీ, జీఎస్‌టీ వంటి బిల్లులు ప్రవేశపెడుతున్న నేపథ్యంలో ఆయా పరిణామాలుప్రభావం చూపొచ్చు. రుతుపవనాలు, ద్రవ్యోల్బణం, ఆర్థిక ఫలితాలు కూడా యథావిధిగా తమ ప్రభావాన్ని కనబరచవచ్చు.

**తక్షణ మద్దతు స్థాయిలు:** 17956, 17846, 17638; **తక్షణ నిరోధ స్థాయిలు:** 18333, 18645, 18895

**స్వల్పకాలంలో ఊగిసలాట పెరిగినా మార్కెట్ అధిక స్థాయిలను తాకొచ్చని అంచనా.**

*–సతీశ్ కంతేటి, జెన్ సెక్యూరిటీస్*